## దివ్యాంగులకు వీల్ చైర్స్ అందజేత




దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్స్ అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

కామారెడ్డి, మే 13 : జిల్లా కేంద్రంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఐదుగురు దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రోటరీ క్లబ్ కామారెడ్డి, జూబ్లీహిల్స్, పిడుగురాళ్ల లైమ్ సిటి సంయుక్త సౌజన్యంతో 50 వేల విలువైన ఐదు వీల్‌చైర్స్‌ను పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి, ట్రెజరర్ కృష్ణహరి, సుభాష్ చంద్ జైన్, కాశీనాథం, ధనంజయ, బాలరాజ్, వెంకటరమణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి అపర్ణ

రాజంపేట్, మే 13 : మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారిణి అపర్ణ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల గుర్తింపు కోసం సూచనలు, సలహాలు ఇచ్చారు. రాజీవ్ యువవికాసం పథకానికి సంబంధించి బ్యాంకు మేనేజర్లతో కలిసి సిబిల్ చెక్ చేయడంపై పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పనులు, ఫాంపాండ్స్, కమ్యూనిటీ సోపిట్స్, ఇన్ డివిజినల్ సోపిట్ల గురించి ప్రజలకు అవగాహణ కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి ఎంపీవోగా సురేందర్

మాచారెడ్డి, మే 13 : మాచారెడ్డి ఎంపీవోగా సురేందర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన నాగరాజు డిప్యూటేషన్‌పై పిట్లం వెళ్లాడు. సురేందర్ సదాశివనగర్‌తోపాటు మాచారెడ్డి ఎంపీవోగా విధులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు స్వాగతం తెలిపారు.

# ఉపాధ్యాయులు సామర్థ్యాన్ని పెంచుకోవాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

రామారెడ్డి(సదాశివనగర్), మే 13 : ఉపాధ్యాయులు తమ సామర్థ్యాన్ని పెంచుకొని విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఉపాధ్యాయులకు సూచించారు. సదాశివనగర్‌లోని మోడల్ స్కూల్‌లో అధ్యాపకులకు ఐదు రోజులపాటు జిల్లా అధికారులు ఇంగ్లిష్‌పై శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతంగా తయారు చేయాలని అధ్యాపకులకు సూచించారు. 100 శాతం ఫలితాలు సాధించాలని, ఎక్కువ మార్కులు సాధించేలా అందరూ కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఐదు రోజులపాటు శిక్షణ ఉంటుందని ఎంఈవో యోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్, సీఆర్పీలు సందురావు, రాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి

**అదనపు కలెక్టర్ విక్టర్**



కోమట్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

లింగంపేట, మే13: వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ఉండడానికి టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. లింగంపేట మండలం కోమట్‌పల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో చేసిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ రైతులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ శాఖ సమాచారం మేరకు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు ధాన్యం తడవకుండా ఉండేందుకు ముందస్తుగా టార్పలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ధాన్యం తూకంలో వ్యత్యాసం రాకుండా చూసుకోవాలని హమాలీలకు సూచించారు. అనంతరం పోతాయిపల్లి గ్రామంలో భూ భారతి చట్టం రికార్డుల పరిశీలన కోసం నిర్వహిస్తున్న డెస్క్ వర్క్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా క్షుణ్ణంగా రికార్డులు తనిఖీ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి



బీర్కూర్ పీహెచ్‌సీలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య

నస్రుల్లాబాద్, మే 13 : వైద్యులు అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య అన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. రోగుల ఓపీ రికార్డులు, స్టాఫ్ అంటెండెన్స్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆమె వెంట సీహెచ్‌వో రవీందర్, సిబ్బంది ఉన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

బాన్సువాడ రూరల్, మే 13 : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొత్తాబాది గ్రామస్తులకు తాగునీటి సరఫరా చేసే రెండు బోరు బావులతోపాటు మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో స్పందించి డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవోతో కలిసి మంగళవారం గ్రామానికి చేరుకొని తాగునీటి సరఫరాపై గ్రామస్తులతో ఆరా తీశారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కారం కోసం తాత్కాలికంగా ఒక బోరుబావిని సిద్ధం చేసి ప్రారంభించారు. త్వరలో జాతీయ రహదారి విస్తరణ విభాగం, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకొని శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామని అన్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో పైప్‌లైన్లు ధ్వంసమై అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులకు మొరపెట్టుకున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి గణేశ్, గ్రామస్తులు ఉన్నారు.



తాగునీటి సమస్య పరిష్కారంపై గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

కామారెడ్డి, మే 13 : ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 11 ఏండ్ల బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయని అన్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయన్నారు. కానీ.. కార్మికుల వేతనాలు పెరగలేవని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మెకు పిలుపునిచ్చారని తెలిపారు. ఈ సమ్మెలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, టీయూసీఐ రాష్ట్ర నాయకులు రమేశ్, ప్రకాశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కిశోర్, కోశాధికారి ఎస్.కిశోర్, నరేందర్, అనిత, శంకర్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

**సార్వత్రిక సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ**

ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించి వాల్ పోస్టర్లను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు దశరథ్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, జిల్లా ప్రభుత్వ దవాఖాన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి రఫీ, పట్టణ అధ్యక్షుడు సందీప్, కార్మికులు ఖైరత్ అలీ, భాస్కర్, రజిత, లక్ష్మి, జమున, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## కారు, బైక్ ఢీ : ఒకరి మృతి

నస్రుల్లాబాద్, మే 13 : బీర్కూర్ శివారులో మంజీరా బ్రిడ్జి మూల మలుపు వద్ద కారు, బైక్ ఢీకొనడంతో బీదర్ జిల్లా ఔరాద్ తాలూకా నండియల్‌కు చెందిన శివనూర్ సంతోష్(32) మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శివనూర్ సంతోష్ గత కొన్ని రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లిలో గొర్రెల మందను మేపడానికి వెళ్లాడు. సోమవారం రాత్రి తన గ్రామానికి చెందిన బసుగొండ అనే వ్యక్తితో కలిసి కొత్తపల్లి నుంచి బీర్కూర్ మీదుగా నండియాల్‌కు బైక్‌పై వెళ్తున్నారు. కొయ్యగుట్ట గ్రామానికి చెందిన ప్రేమ్‌సింగ్ బిచ్కుంద నుంచి బీర్కూర్‌వైపు కారులో వస్తున్న క్రమంలో బీర్కూర్ మూల మలుపు వద్ద సంతోష్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొనడంతో సంతోష్‌కు, బసుగొండకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారిని 108 వాహనంలో బాన్సువాడ దవాఖానకు తరలించారన్నారు. సంతోష్ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ దవాఖానకు తరలిస్తుండగా సోమవారం అర్ధరాత్రి మార్గమధ్యంలో మృతి చెందాడు. భార్య అంబిక మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



సుల్తాన్‌నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్

నిజాంసాగర్, మే 13 : మండలంలోని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన సుల్తాన్‌నగర్ గ్రామ పంచాయతీని ఎంపీడీవో గంగాధర్ మంగళవారం సందర్శించారు. గ్రామంలో నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. అందులో బేస్మెంట్ వరకు పూర్తి చేసిన 4 ఇండ్లకు గాను 4 లక్షల రూపాయలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గంగాప్రసాద్, గ్రామ కార్యదర్శి రవి రాథోడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణానికి మార్కింగ్



దేవాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహనిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న అధికారులు

లింగంపేట(తాడ్వాయి), మే13: తాడ్వాయి మండలం దేవాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి అధికారులు మంగళవారం మార్కింగ్ చేశారు. ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించిన అధికారులు వారికి గృహాలు మంజూరు చేశారు. లబ్ధిదారులకు చెందిన ఖాళీ స్థలాల్లో గృహ నిర్మాణాల కోసం మార్కింగ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యోగాపై శిక్షణ



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

లింగంపేట, మే13: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం వహీద్ సిద్ధిఖీ మంగళవారం తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. యోగాతోపాటు ధ్యానం, సూర్య నమస్కారాలు నేర్పిస్తున్నామన్నారు. యోగా నిపుణులు బాణాల గంగారెడ్డి, కుసుమ రమేశ్, ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజు, యూసుఫ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి

ఎల్లారెడ్డిరూరల్, మే 13: ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని 7వ వార్డులో 10 ఇండ్లు మంజూరు కాగా, ఆయన రెండు ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను మధ్యలో ఆపవద్దని, పనులు కొనసాగుతుంటేనే విడుతల వారీగా ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయని, లబ్ధిదారులు ఎటువంటి అలసత్వం వహించకుండా నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.

**అంబలి కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే..**

పట్టణంలోని గాంధీచౌక్‌లో ఎమ్మెల్యే అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబలి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్ గౌడ్, నాయకులు సామెల్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి గాంధీచౌక్‌లో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# 'పథకాన్ని' నిబంధనలు లేకుండా అందరికీ వర్తింపజేయాలి

రామారెడ్డి ఏప్రిల్13 : రాజీవ్ యువ వికాస్ పథకాన్ని నిబంధనలు లేకుండా అందరికీ వర్తింపజేయాలని మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. రాజీవ్ యువ వికాస్ పథకానికి నిరుద్యోగ యువతీ యువకులకు రూ. 50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రాయితీ (సబ్సిడీ) ఇస్తామని, అందరూ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పగా, వ్యయప్రయాసాలకు ఓర్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఎవరికైతే సిబిల్ స్కోర్ ఉంటుందో వారికి మాత్రమే ఇస్తామని ప్రకటించడంతో గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు ఈ స్కీంకు అర్హత కోల్పోతారన్నారు. ముందే సిబిల్ స్కోర్ గురించి చెబితే సిబిల్ ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకునే వారని, ఇప్పుడు పలు రకాల షరతులు పెట్టి సభ్యుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నదని మండిపడ్డారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ పథకాన్ని వర్తింపజేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి ల్యాగల మహిపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాల్‌దేవ్ అంజయ్య, సుధాకర్, లింగం, కిషన్‌గౌడ్, సంపత్ పాల్గొన్నారు.



రామారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి

## ఆసక్తికరంగా సాగిన కుస్తీ పోటీలు

మద్నూర్, మే 13 : మండలకేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరం ఆధ్వర్యంలో మంగళవారం రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండోరోజు అన్నప్రసాదంతో పాటు కుస్తీపోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీపోటీల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొని ప్రత్యేకపూజలు చేసి పోటీలను తిలకించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సాయంత్రం ఆలయం నుంచి పాత బస్టాండ్ హనుమాన్ మందిరం వరకు రథాన్ని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

## నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

లింగంపేట, మే 13: మండలంలోని బాణాపూర్, ఒంటర్‌పల్లి గ్రామాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బుధవారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. ఒంటర్‌పల్లి గ్రామం నుంచి గట్టుమైసమ్మ తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే బాణాపూర్ గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పీటీఆర్‌ను పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



జంగమాయిపల్లిలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న రజితారెడ్డి

ఎల్లారెడ్డి రూరల్, మే 13: మండలంలోని జంగమాయిపల్లి గ్రామంలో మంగళవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చెవుల సాయిలుకు రూ.44వేలు, నాయికోటి ఎల్లయ్యకు రూ.28వేల విలువైన చెక్కును అందజేశారు. ఆమెతో పాటు స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**లింగంపేటలో..**

లింగంపేట, మే13: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన సంగన్నగారి భూమాగౌడ్, సిద్ధాగౌడ్‌లకు 1.75లక్షల రూపాయల విలువైన చెక్కులను వారి ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, గ్రామ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



లింగంపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

## నల్లమడుగులో ఘనంగా రథోత్సవం



నల్లమడుగు గ్రామంలో రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

లింగంపేట, మే13: మండలంలోని నల్లమడుగు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని రంగురంగుల పూలతో అందంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామదేవతలకు బోనాలు సమర్పించి పండుగ నిర్వహించుకున్నారు.